కుక్కల బెడద.. నిత్యం వ్యథ

- రోడ్లపైకి రావాలంటే జంకుతున్న ప్రజలు
- రోజురోజుకు పెరుగుతున్న కుక్కకాటు బాధితులు
- అధికారుల చర్యలు శూన్యం



నగరంలోని చిల్డ్రన్స్‌పార్కు, అపోలో ఆస్పత్రి సమీపంలో ఓ వీధిలో సంచరిస్తున్న శునకాలు

నెల్లూరు(బారకాసు) : వీధి సింహాలు నగర ప్రజలకు చుక్కలు చూపిస్తున్నాయి. కుక్కల నియంత్రణపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో నగరంలో వాటి సంఖ్య నానాటికీ పెరుగుతోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మహిళలు, చిన్నారులపై దాడి చేస్తున్నాయని వాపోతున్నారు. ద్విచక్ర వాహనాలు వెళ్తుంటే వెంటాడుతున్నాయని.. ఎక్కడ కరుస్తాయోనని భయాందోళన చెందుతున్నారు.

కుక్కల బెడద తీవ్రంగా ఉన్న ప్రాంతాలు

నగరంలోని నవాబుపేట, జాకీర్ హుస్సేన్‌నగర్, న్యూ కాలనీ, మారుతీనగర్, కిసాన్‌నగర్, వెంకటేశ్వరపురం, భగత్‌సింగ్‌కాలనీ, సంతపేట, జెండావీధి, మూలాపేట, ఫత్తేఖాన్‌పేట, వనంతోపు సెంటర్, కొండాయపాళెం గేట్, పొదలకూరురోడ్డు, డైకస్‌రోడ్డు, మనుమసిద్దిన గర్, ఏసీ నగర్, బాలాజీ నగర్, సత్యనారాయణపురం, నజీర్‌తోట, రంగనాయకులపేట, గాంధీనగర్, వేదాయపాళెం, బీవీనగర్, హరనాథపురం తదితర ప్రాంతాల్లో కుక్కల బెడద తీవ్రంగా ఉంది. సాయంత్రం 6 గంటలైతే చాలు ఎక్కడ కుక్కలు తమ వెంట పడుతాయోనన్న భయం ఆయా ప్రాంతాల్లోని ప్రజల్లో నెలకొంది. అంతేకాకుండా పలు ప్రాంతాల్లో ఉన్న చికెన్ దుకాణాల వద్ద కోళ్ల వ్యర్థాల కోసం కుక్కలు గుంపులుగా చేరి అక్కడే ఉండటంతో వాటి బెడద తీవ్రంగా ఉందని నగర వాసులు చెబుతున్నారు.

ప్రజలు బెంబేలు..

నగరపాలక సంస్థ పరిధిలోని 54 డివిజన్లలో దాదాపు 8.10 లక్షల మంది నివసిస్తున్నారు. ప్రతి వీధిలో కనీసం 5 కుక్కలు తిరుగుతూనే ఉన్నాయి. ఇలా నగరంలో దాదాపు 50 వేలకు పైగా వీధి కుక్కలు ఉంటాయని అంచనా. ఆయా వీధుల్లో ఎవరైనా బైక్ లేదా నడిచి వెళ్తుంటే వారిని కుక్కలు తరుముకుంటున్నాయి. దీంతో వారు నిత్యం ఆందోళనకు గురవుతున్నారు.

మూగజీవాలపై దాడులు

చికెన్ వ్యర్థాలు లేని సమయంలో కుక్కలు మూగజీవాలతో పాటు ప్రజలపైనా దాడులు చేసి గాయపరుస్తున్నాయి. జిల్లాలోని అనేక ప్రాంతాల్లో పదుల సంఖ్యలో పశువులు కుక్కకాటుకు గురైనట్లు తెలుస్తోంది. కొన్ని ప్రాంతాల్లో మేకల మందలు, నాటు కోళ్లపై దాడి చేసి చంపేస్తున్నాయని పెంపకందారులు వాపోతున్నారు.

చర్యలు చేపడుతున్నాం



నగరంలో వీధి కుక్కల నియంత్రణకు చర్యలు చేపడుతున్నాం. కుక్కలను పట్టుకుని పాత మున్సిపల్ కార్యాలయ సమీపంలోని యానిమల్ బర్త్ కంట్రోల్(ఏబీసీ) కేంద్రానికి తీసుకొచ్చి శస్త్రచికిత్స చేస్తున్నాం. ఈ ప్రక్రియ నిత్యం జరుగుతూనే ఉంటుంది. పిచ్చి కుక్కలను గుర్తించిన వెంటనే తమకు సమాచారం ఇస్తే వాటిని పట్టుకుని తగు చర్యలు చేపడుతాం.

– డాక్టర్ మదన్‌మోహన్, వెటర్నరీ వైద్యుడు, నగరపాలక సంస్థ

దాడులు చేస్తున్నాయి



వీధి కుక్కలతో తరచూ ఇబ్బందులు పడుతున్నాం. ముఖ్యంగా చిన్నారులు, మహిళలు బయటకు రావాలంటేనే జంకుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలి.

– ఖాలీద్, జెండావీధి

నియంత్రణకు చర్యలు తీసుకోవాలి



నగరంలోని పలు ప్రాంతాల ప్రజలు కుక్కల బెడదతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయాలలో బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. అధికారులు స్పందించి కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలి.

– రఫీ, నవాబుపేట

మౌలిక వసతులు కల్పించండి



11వ డివిజన్‌లో కాలువలో వేసిన చెత్తను పరిశీలిస్తున్న కమిషనర్ సూర్యతేజ

నెల్లూరు(బారకాసు) : నగరపాలక సంస్థ పరిధిలోని 11వ డివిజన్ ఎన్టీఆర్ నగర్ ప్రాంతంలోని మూడు జెండాల సెంటర్ వద్ద ప్రజాపార్కులో గ్రౌండ్ లెవలింగ్‌ను పూర్తి చేసి, క్రీడా సామగ్రి, ఫుట్‌పాత్, పచ్చదనం, ఆర్చి నిర్మాణం, పెయింటింగ్, వ్యాయామ పరికరాలు, బెంచీల ఏర్పాటు, మొక్కల పెంపకం తదితర మౌలిక వసతులను కల్పించాలని కమిషనర్ సూర్యతేజ అధికారులను ఆదేశించారు. పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక 11వ డివిజన్ ఎన్టీఆర్ నగర్, నిర్మలా నగర్, వెంగమాంబ నగర్ 1, 2, ఎస్వీజీఎస్ కళాశాల మైదానం తదితర ప్రాంతాల్లో కమిషనర్ బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ.20 లక్షలతో పార్కులో అవసరమైన అన్ని వసతులను కల్పించి అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. డ్రెయిన్ కాలువల్లో పూడికతీత పనులు, సిల్టు ఎత్తివేత పనులను క్రమం తప్పకుండా నిర్వహించాలని సూచించారు. ఎస్వీజీఎస్ కళాశాల సమీపంలోని మేజర్ కాలువను శుభ్రం చేయించాలన్నారు. కళాశాల మైదానం సమీపంలో తాత్కాలిక నివాసాలను ఏర్పాటు చేసుకుని జీవిస్తున్న వారిని గుర్తించిన కమిషనర్ సంబంధిత ఐటీడీఏ అధికారులతో మాట్లాడి ప్రత్యామ్నాయ అవకాశాలు కల్పించాలని సూచించారు. ఎన్టీఆర్ నగర్, రాయపుపాళెం ప్రాంతంలో మున్సిపల్ ప్రాథమిక పాఠశాలను ఏర్పాటు చేయమని స్థానికులు కోరగా, అందుకు గల అవకాశాలను పరిశీలిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ విభాగం ఎస్ఈ రామ్మోహన్‌రావు, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, రెవెన్యూ ఆఫీసర్ ఇనాయతుల్లా, డీఈఈ ముజాహిద్దీన్, అసిస్టెంట్ డైరెక్టర్ అర్బికల్చర్ ప్రదీప్‌కుమార్, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి



శివాజీ మహరాజ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు, మిత్రమండలి సభ్యులు

నెల్లూరు(బృందావనం) : నగరంలోని ట్రంకురోడ్డులో ఛత్రపతి శివాజీ మహరాజ్ 496వ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. శివాజీ సెంటర్‌లో తొలుత శివాజీ మహరాజ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్యఅతిథిగా బీజేపీ రాష్ట్ర నేత పి.సురేందర్‌రెడ్డి హాజరై, మాట్లాడారు. భారత స్వాతంత్ర్య సంగ్రామానికి ఛత్రపతి స్ఫూర్తిదాయకమన్నారు. ఆయన ఆశయాలను యువత ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. శివాజీ మిత్రమండలి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిపారెడ్డి వంశీధర్‌రెడ్డి, మరాఠా మిత్రమండలి అధ్యక్షుడు దేవదాస్ జాదవ్, సందీప్ పాండురంగ, సంఘసేవకులు ఎన్వీ సుబ్బారావు, మిత్రమండలి సభ్యులు కేవీ సుబ్రహ్మణ్యం, పి.సత్యనాగేశ్వరరావు, బీఎస్ రంగరాజన్, మధుసూదన్, బాలసుబ్రహ్మణ్యం, హర్షవర్ధన్ పాల్గొన్నారు.

➡ శివాజీ మహరాజ్ విగ్రహానికి బీజేపీ నేత మిడతల రమేష్ నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు నరాల సుబ్బారెడ్డి, నీలిశెట్టి లక్ష్మణ్‌రావు, అల్లి రవికుమార్‌యాదవ్, రత్నంభవాని, అరవింద్, కె.భాస్కర్, రామ్మోహన్‌రావు, బుధవరపు బాలాజీ పాల్గొన్నారు.

క్లుప్తంగా

బైక్‌ల దొంగ అరెస్ట్



నిందితుని వివరాలను వెల్లడిస్తున్న ఇన్‌స్పెక్టర్

నెల్లూరు(క్రైమ్) : టీవీఎస్ ఎక్స్‌ఎల్ మోపెడ్‌లను దొంగలించి కళ్లుగప్పి తిరుగుతున్న ఓ పాతనేరస్తుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. చిన్నబజారు పోలీసుస్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు బుధవారం నిందితుని వివరాలను వెల్లడించారు. నెల్లూరు రూరల్ మండలం కొత్తూరు వైఎస్సార్ నగర్‌కు చెందిన చిన్నబ్బాయి పాతనేరస్తుడు. ఆయన బుధవారం ఇరుకళల పరమేశ్వరి గుడి సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతుండగా చిన్నబజారు, సీసీఎస్ పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు. అనంతరం నిందితుడిని తమదైన శైలిలో విచారించగా చిన్నబజారు పోలీసుస్టేషన్, నవాబుపేట, తిరుపతి జిల్లా గూడూరు టు టౌన్ పోలీసుస్టేషన్‌ల పరిధిలో టీవీఎస్ ఎక్స్‌ఎల్ మోపెడ్‌లను దొంగలించినట్లు నేరం అంగీకరించారు. దీంతో నిందితుడిని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి నాలుగు మోపెడ్‌లను స్వాధీనం చేసుకున్నామని ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు తెలిపారు. ఎస్సై అయ్యప్ప పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..



నగర డీఎస్పీకి పూలమొక్కను అందజేస్తున్న పీహెచ్‌పీలు

నెల్లూరు(క్రైమ్) : కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు నగర డీఎస్పీ సింధుప్రియను ఆమె కార్యాలయంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పూలమొక్క ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ సైబర్ నేరాలు, మనీ స్కామ్, బెట్టింగ్‌లు, మత్తు, మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమాల్లో భాగస్వాములై ప్రజలను చైతన్యవంతులు చేయాలని కోరారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్, నాయకులు షేక్.సత్తార్, గోరంట్ల శేషయ్య, దేవరకొండ శ్రీనివాసులు, కె.రామరాఘవయ్య, ఎం.శ్రీధర్‌రావు, బి.శంకర్‌రావు పాల్గొన్నారు.

వధూవరులకు ఎమ్మెల్సీ ఆశీర్వాదం



వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్సీ పర్వతరెడ్డి

నెల్లూరు(బారకాసు) : నగరంలోని సంతపేటలో ఉన్న రాఘవ కల్యాణ మండపంలో బుధవారం జరిగిన వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకుడు దీపు సోదరుడు ఉదయ్ వివాహ వేడుకకు పార్టీ సిటీ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మజ్జిగ జయకృష్ణారెడ్డి, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు, కార్పొరేటర్ ఊటుకూరు నాగార్జునతో పాటు పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నరసింహారెడ్డికి నివాళి

బాలాజీనగర్‌లో వైఎస్సార్‌సీపీ నాయకుడు వాకా నరసింహారెడ్డి పెద్దకర్మకు సిటీ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా నరసింహారెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు.

సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన



నెల్లూరు సిటీ : రూరల్ నియోజకవర్గంలోని 18వ డివిజన్‌లో సీసీరోడ్డు పనులకు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజలు ఉండే ప్రాంతాల్లో సమస్యలను గుర్తించి అభివృద్ధి చేసే దిశగా అడుగులు వేస్తామన్నారు. టీడీపీ నేత వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి నిర్వహిస్తున్న గడప గడపకు కార్యక్రమంలో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి బుధవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు మెచ్చేలా పనిచేస్తానన్నారు.

22న రాష్ట్రస్థాయి రెడ్ల ఆత్మీయ సమ్మేళనం



మాట్లాడుతున్న నిర్మల నరసింహారెడ్డి

నెల్లూరు(బృందావనం) : ఈనెల 22వ తేదీన కోవూరు పీవీఆర్ ఫంక్షన్ హాల్లో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి సందర్భంగా 'రాష్ట్రస్థాయి రెడ్ల ఆత్మీయ సమ్మేళనం' శనివారం జరుగనుందని రెడ్ల ఐక్యవేదిక అధ్యక్షుడు నిర్మల నరసింహారెడ్డి తెలిపారు. నగరంలోని బట్వాడిపాళెం శాంతినగర్‌లో ఉన్న రెడ్ల ఐక్యవేదిక కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జక్కంరెడ్డి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమంలో దేశంలోని పలురాష్ట్రాల నుంచి రెడ్డి సంఘీయులు, వివిధ రంగాలకు చెందిన మేధావులు, పెద్దలు పాల్గొంటారన్నారు. రెడ్డిజాతి ఐక్యత, పురోభివృద్ధిని కాంక్షించి కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. జిల్లాలోని రెడ్డి సంఘీయులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో రెడ్ల ఐక్యవేదిక నిర్వాహకులు డాక్టర్ బీవీరెడ్డి, డాక్టర్ ధనుంజయరెడ్డి, గుండాల ప్రతాప్‌రెడ్డి, బూదూరు మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాతృభాషకు ప్రాధాన్యత ఇవ్వాలి



జ్ఞాపికలతో దంత వైద్య విద్యార్థినులు

నెల్లూరు(అర్బన్) : మాతృభాషకు ప్రభుత్వాలు తగిన ప్రాధాన్యత కల్పించాలని నారాయణ దంత వైద్యకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అజయ్‌రొనాల్డ్ అన్నారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో స్థానిక నారాయణ దంత వైద్యకళాశాల విద్యార్థినులకు బుధవారం కవితల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల ద్వారా సాంస్కృతిక, సాహిత్య కార్యక్రమాలపై అవగాహన పెంచుకుంటారన్నారు. పోటీల్లో పాల్గొన్న వారికి జ్ఞాపికలు, పుస్తకాలు బహూకరించారు. కార్యక్రమంలో రచయితల సంఘం అధ్యక్షుడు జయప్రకాష్, నెరసం కార్యదర్శి పాతూరి అన్నపూర్ణ, భారతి, లక్ష్మి పాల్గొన్నారు.

పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా కృషి



మాట్లాడుతున్న కమిషనర్ సూర్యతేజ



సమావేశానికి హాజరైన శానిటేషన్ విభాగాధికారులు, కార్యదర్శులు

- కమిషనర్ సూర్యతేజ

నెల్లూరు(బారకాసు) : నగర వ్యాప్తంగా పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా కృషి చేయాలని పారిశుద్ధ్య విభాగం అధికారులు, సిబ్బందికి కమిషనర్ సూర్యతేజ సూచించారు. కార్పొరేషన్ కార్యాలయం కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో పారిశుద్ధ్య విభాగంతో వారాంతపు సమీక్ష సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు వేయకుండా నిరంతరం పర్యవేక్షించాలని, అలా వేస్తున్న వారిని గుర్తించి జరిమానాలు విధించాలని సూచించారు. షాపులు, హోటళ్లలో వాడేసిన మురుగు నీరు రోడ్లపై పారకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకునేలా యజమానులకు సూచించాలన్నారు. ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు జారీ చేసి శుభ్రంగా చేసుకోవాలని అవగాహన కల్పించాలన్నారు. చేపలు, మాంసం మార్కెట్లు, జంతువధ శాలల వద్ద ఉన్నత స్థాయి ప్రమాణాలను పాటించేలా నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. రూ.34 కోట్లతో ప్రతి సచివాలయానికి రెండు వాహనాల చొప్పున 350 నూతన చెత్త సేకరణ వాహనాలను త్వరలో అందించనున్నామని తెలిపారు. వ్యర్థాల తరలింపునకు వీలుగా 20 కంపాక్టర్లు, 12 పెద్ద కంపాక్టర్లు ప్రతిరోజూ ఐదు ట్రిప్పులతో వ్యర్థాలను తరలించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రతిరోజు ఉదయం 6 గంటలకు మస్టర్ పాయింట్ల వద్ద చెత్త సేకరణ వాహనాలు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కమిషనర్ నందన్, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ చైతన్య, వెటర్నరీ డాక్టర్ మదన్‌మోహన్ శానిటేషన్ విభాగం అధికారులు, ఇన్‌స్పెక్టర్లు, వార్డు సచివాలయ శానిటేషన్ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

'పోడుగాలి' కథా సంపుటికి పురస్కారం

నెల్లూరు(బృందావనం) : నెల్లూరు రచయిత ఈతకోట సుబ్బారావు రచించిన 'పోడుగాలి' కథా సంపుటి జాతీయ స్థాయి పురస్కారాన్ని అందుకుంది. వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన కొనిరెడ్డి ఫౌండేషన్, చదువుల సాహిత్య కళావేదిక నిర్వహించిన జాతీయ సాహిత్య పురస్కారాలు– 2025కు సంబంధించి జాతీయ కథా సంపుటి పోటీల్లో 'పోడుగాలి' పురస్కారాన్ని అందుకుందని కళావేదిక నిర్వాహకుడు చదువుల బాబు బుధవారం తెలిపారు.

బుచ్చి కమిషనర్‌గా బాలకృష్ణ



బాలకృష్ణ

నెల్లూరు(బారకాసు) : నెల్లూరు కార్పొరేషన్‌లోని టౌన్ ప్రాజెక్ట్ రిసోర్సెస్ ఆఫీసర్(టీపీఆర్ఓ) విభాగానికి సూపరింటెండెంట్‌గా ఉన్న బాలకృష్ణను బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ కమిషనర్‌గా నియమిస్తూ రాష్ట్ర పురపాలక శాఖ కార్యాలయం మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు బుధవారం సాయంత్రం బుచ్చి కమిషనర్‌గా బాలకృష్ణ పదవీ బాధ్యతలు స్వీకరించారు.

ఏఐ టూల్స్‌పై అవగాహన

నెల్లూరు (టౌన్) : స్థానిక డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) టూల్స్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. భవిష్య తరాలను ఏఐ ఎలా సులభతరం చేయనున్నది అనే అంశంపై టెక్సాస్ నుంచి వచ్చిన సతీష్ కామిరెడ్డి ఉపన్యాసం చేశారు. ఏఐ టూల్స్ సమర్థవంతంగా వివిధ రంగాల్లో వినియోగించేందుకు ప్రాంప్ట్ ఇంజినీరింగ్ లాంటివి ఏ విధంగా ఉపయోగపడనున్నాయో వివరించారు. అనంతరం ఆయనను శాలువతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ గిరి, అధ్యాపకురాలు గీత తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ సభ్యుడు నరేష్‌కుమార్‌పై చర్యలు తీసుకోవాలి

నెల్లూరు(బృందావనం) : టీటీడీ పాలకమండలి సభ్యుడు నరేష్‌కుమార్‌పై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చట్టపరంగా చర్యలు తీసుకోవాలని బీజేపీ నేత మిడతల రమేష్ డిమాండ్ చేశారు. స్థానిక ట్రంకురోడ్డు శివాజీసెంటర్‌లో ఆయన బుధవారం మాట్లాడారు. తిరుమల ఆలయ ప్రాంగణంలో విధి నిర్వహణలో ఉన్న టీటీడీ చిరుద్యోగి పట్ల అనుచితంగా ప్రవర్తించడమే కాకుండా తిట్ల దండకం ఎత్తుకున్న బెంగళూరుకు చెందిన బోర్డు సభ్యుడు నరేష్‌కుమార్‌పై చర్యలు తీసుకోవాలన్నారు.

ముగిసిన ఇంటర్ ప్రాక్టికల్స్

నెల్లూరు (టౌన్): ఇంటర్ ప్రాక్టికల్స్ బుధవారంతో ముగిశాయి. ఉదయం జరిగిన పరీక్షకు 375 మందికి గానూ 369 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన ప్రాక్టికల్స్‌కు 381 మందికి గానూ ఆరుగురు గైర్హాజరయ్యారు.

రెడ్‌క్రాస్‌కు కూలర్ల వితరణ



నెల్లూరు(అర్బన్) : ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కమిటీకి దివంగత బెజవాడ సుందరరామిరెడ్డి జ్ఞాపకార్థంగా ఆయన కుమారుడు సునీల్‌రెడ్డి రూ.45 వేల విలువ చేసే మూడు తాగునీటి కూలర్ ఫ్రీజర్లను వితరణ చేశారు. వీటిని స్థానిక మద్రాస్ బస్టాండ్ వద్ద ఉన్న రెడ్‌క్రాస్ కార్యాలయంలో బుధవారం అందచేశారు. బ్లడ్‌బ్యాంక్ మోటివేటర్, రెడ్‌క్రాస్ మోర్గ్ కన్వీనర్ సాయిరాం, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్‌కు సన్మానం



నెల్లూరు (టౌన్) : ఢిల్లీలో జరిగిన గణతంత్ర వేడుకల పరేడ్‌లో పాల్గొన్న కృష్ణచైతన్య డిగ్రీ కళాశాల విద్యార్థి చెన్నారెడ్డి నితిన్‌ను బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ కృష్ణారెడ్డి, డైరెక్టర్ ప్రమోద్‌రెడ్డి మాట్లాడుతూ పరేడ్‌లో పాల్గొనడం తమ కళాశాలకు ఎంతో గర్వకారణమన్నారు. కార్యక్రమంలో డీన్లు రామాంజనేయులురెడ్డి, సుధారాణి, ప్రిన్సిపల్ నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆప్కాస్‌ను రద్దు చేస్తే సహించం



మాట్లాడుతున్న సతీష్‌కుమార్

నెల్లూరు(అర్బన్) : కాంట్రాక్ట్ ఏజెన్సీల దోపిడీని అరికట్టేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల కార్పొరేషన్(ఆప్కాస్)ను రద్దు చేస్తే సహించమని, ఈ యోచనను కూటమి ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని జిల్లా కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల ఫెడరేషన్ చైర్మన్ నరమాల సతీష్‌కుమార్ డిమాండ్ చేశారు. యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ ఆప్కాస్ యూనియన్ సమావేశం దర్గామిట్టలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా సతీష్‌కుమార్ మాట్లాడుతూ గతంలో అవుట్ సోర్సింగ్ విధానంలో ఏజెన్సీల కింద పనిచేస్తున్న పారిశుద్ధ్య, సొసైటీ కార్మికులు, అటెండర్లు, సెక్యూరిటీ, ఎంఎన్ఓ తదితర ఉద్యోగులకు ప్రభుత్వ నిబంధనల మేరకు కాకుండా ఏజెన్సీలు నిధులు మింగేసి అరకొర జీతాలు ఇచ్చేవారన్నారు. దీనిని గమనించిన అప్పటి ప్రభుత్వం ఆప్కాస్‌ను ఏర్పాటు చేసి ఒకటో తేదీకి జీతాలు వచ్చేలా చర్యలు తీసుకుందన్నారు. అయితే నేటి ప్రభుత్వం మళ్లీ పాత విధానాన్ని తెచ్చేందుకు పూనుకోవడం దుర్మార్గమన్నారు. ఆప్కాస్ వ్యవస్థను నిలుపుకునేందుకు ప్రభుత్వంపై పోరాడుతామన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి సందానిబాషా, అధ్యక్షుడు శ్రీనివాసులు, నాయకులు రాజీవ్‌రెడ్డి, వెంకటేశ్వర్లురెడ్డి, సురేంద్రబాబు, కవిత, అఫ్రిన్, రాజేశ్వరి, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

మినహాయింపు ఇవ్వాలని వినతి



డీఈఓకు వినతిపత్రం ఇస్తున్న బీటీఏ నేతలు

నెల్లూరు (టౌన్) : పదో తరగతి ఇన్విజిలేషన్, స్పాట్ వాల్యుయేషన్లలో గర్భిణులు, బాలింతలు, దీర్ఘకాలిక వ్యాధితో బాధలు పడేవారికి మినహాయింపు ఇవ్వాలని బీటీఏ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు వేణుగోపాల్ కోరారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈఓ బాలాజీరావును బుధవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో బీటీఏ నాయకులు ఆదినారాయణ, మాల్యాద్రి, రఘు, పెంచలప్రసాద్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

తప్పులను సరిచేసి మెయిన్స్ నిర్వహించాలి



డీఆర్వోకు సమస్యను వివరిస్తున్న అభ్యర్థులు

నెల్లూరు(అర్బన్) : గ్రూప్–2 పరీక్షలకు సంబంధించి రోస్టర్ విధానంలో జరిగిన తప్పులను సరిచేసిన తర్వాత మెయిన్స్ పరీక్షలు నిర్వహించాలని మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్స్ సొసైటీ అధ్యక్షుడు నక్కా మస్తాన్ కోరారు. ఈ మేరకు సొసైటీ ఆధ్వర్యంలో పలువురు గ్రూపు–2 అభ్యర్థులు కలెక్టరేట్‌లో డీఆర్వో ఉదయభాస్కర్‌రావుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో కాలంగా నిరుద్యోగులు గ్రూపు–2 కోసం శిక్షణ తీసుకుంటున్నారన్నారు. అయితే రోస్టర్ విధానంలో తప్పులు ఉండడంతో బడుగు, బలహీన వర్గాలకు చెందిన వారు తమ రిజర్వేషన్ కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో అభ్యర్థులు జనార్దన్, అశోక్, శ్రీకాంత్, శ్రీనివాసులు, గణేష్, గంగరాజు, దొరబాబు, నాగరాజు, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ



నెల్లూరు(బృందావనం) : కొండాయపాళెం రోడ్డులోని అబైడింగ్ హోప్ ట్రస్ట్ కార్యాలయంలో బాలలు, దివ్యాంగులు, వృద్ధులకు పౌష్టికాహార పంపిణీతో పాటు అన్నదానాన్ని డైరెక్టర్, విశ్రాంత ప్రిన్సిపల్ డాక్టర్ టైటస్ నిర్మల్‌కుమార్ సౌజన్యంతో బుధవారం నిర్వహించారు. వివిధ స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు, సిస్టర్ రమా, రూత్ బినోమి, మరియమ్మ, బాబు, సుభాషిణి, డేవిడ్ లివింగ్‌స్టన్, విలియమ్స్ నిఖిల్, జోసెఫ్ పాల్గొన్నారు.

భూ పరిహారం పెంచాలని వినతి

నెల్లూరు(అర్బన్) : జిల్లాలో రామాయపట్నం పోర్టు, పరిశ్రమలు, జాతీయ రహదారులను ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో భూములను కోల్పోతున్న వారికి భూపరిహారాన్ని పెంచాలని పలువురు రైతులు కోరారు. ఈ మేరకు కావలి మండలంలోని చెన్నాయపాళెం, పెద పట్టపుపాళెం పంచాయతీల పరిధిలోని గ్రామాల రైతులు బుధవారం కలెక్టరేట్ అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అక్కడి రైతులు, మాజీ ఏఎంసీ చైర్మన్ ప్రసాద్ యాదవ్ తదితరులు మాట్లాడుతూ భూసేకరణ చేపడితే ఆ మేరకు నష్టపరిహారాన్ని చెల్లించడంతో పాటు జీవనోపాధి కల్పించాలని కోరారు.